
# అమెరి'కులాసా' కథలు
## – వంగూరి చిట్టెన్ రాజు





## అమెరికులాసా కథ – 212
## అమెరి'కెలికింగ్' కథ

దేవుడు అయినా, దేవత అయినా భలే తెలివైన వాళ్ళు. ఎందుకంటే తను పుట్టించిన ప్రతీ జాతికీ ఏదో ఒక ప్రత్యేక లక్షణం, అవలక్షణలాతో 'తాంబూలం ఇచ్చేసి' తమలో తాము నవ్వుకుంటారు. ఉదాహరణకి మలయాళీలు, ఇజ్రాయిల్ వాళ్ళూ జాతికి లక్షణమైనది వ్యాపారం కాబట్టి చంద్ర గ్రహం మీద కూడా టీ కొట్టు, బంగారం షాపులూ పెట్టగలరు. హమాస్, టాలిబాన్ లాంటి వాళ్ళకి ఉగ్రవాదం అయితే గంటకో గ్లాసు వోడ్కా తాగి పక్క దేశాలని ఆక్రమించడం రష్యా వాళ్ళ లక్షణం. ఇక మన పవిత్ర భారతీయులకి నిజాయితీగా బతకడం గురించి నీతులు చెప్పడం, ఆమ్యామ్యాలు, 'మేనేజ్ మెంట్ ఖర్చులు' ఇవ్వకుండా, పుచ్చుకోకుండా అస్సలు బతకలేక పోవడం పురాణ కాలం నుంచీ ఉన్న ఒక అవలక్షణం. ఇక తెలుగు జాతి అంటారా? ప్రపంచంలో ఏ ఖండంలో ఉన్నా, మరీ ముఖ్యంగా మా అమెరికాలో ఉన్న తెలుగు వారి జాతి లక్షణం "అమెరి'కెలికింగ్'..

అమెరికెలికింగ్ అనగా... అవసరం ఉన్నా లేక పోయినా, అడిగినా అడగక పోయినా, తనకి ఏ మాత్రం సంబంధం లేని విషయం అయినా సరే...పని కట్టుకుని కెలకడం అనమాట. అది భార్యాభర్తల మధ్యే అయితే అది"కిచెన్ కెలికింగ్' 'పడక గది కెలికింగ్', కిరాణా కొట్టు కెలికింగ్", పెళ్ళాం కెలికింగ్, మొగుడు కెలికింగ్...ఇద్దరూ కలిసి మెలిసి జాయింట్ గా పిల్లల కెలింగులూ.. ఇలా అనేక రకాలుగా ఉంటాయి. ఉదాహరణకి మొన్నీ మధ్య నా మానాన నేను సరదాగా ఏదో వంట చేద్దాం అని కిచెన్ లోకి వెళ్ళీ వెళ్ళగానే ఎక్కడి నుంచో మా క్వీన్ విక్టోరియా రివ్వుమని దూసుకు వచ్చి "ఇక్కడేదైనా కెలికావంటే, చూసుకో" అని తన అందమైన చూపుడు వేలుని వెయ్యి మైళ్ళ స్పీడు లో దడ దడ లాడించింది. అదనమాట అమెరి కిచెన్ కెలికింగ్ అంటే...నిజానికి అప్పుడు నేను ఇంకా బంగాళ దుంపలు తొక్కు కూడా తియ్య లేదు. అలాంటిది ఇక ఉల్లిపాయలు కూడా తరిగితే ఎంత కొంప మునిగేదో కదా!. ఇక వారం, వారం గ్రోసరీ షాపింగ్ లిస్ట్ రాయడం ఆవిడ వంతు అయితే కూరల మార్కెట్, కిరాణా కొట్టు, అశ్వ గంధతో సహా మందులూ, గడ్డీ, గాదం, దుప్పట్లూ, చేపలు పట్టు సామానూ, బూట్లూ, కంప్యూటర్లూ.. ఇలా అన్నీ ఒకే చోట దొరికే వాల్ మార్ట్ కి వెళ్ళి అవి

కొనుక్కురావడం నా పెళ్ళినాటి ప్రమాణాలలో ఒకటి. అయితే ఆ సంచులన్నీ మోసుకుని నేను ఇంట్లో అడుగుపెట్టగానే తను ప్రతీ సంచీ లోనూ ముందు వేలుతో చిన్న కెలుకుడూ, తర్వాత వాటిని బయట పెట్టి కూలంకష కెలకుడూ మొదలు పెడుతుంది. ఎందుకనగా....తను లిస్ట్ లో రాసినవాటికన్నా నేను ఏ ఒక్క ఐటెమ్ ఎగస్ట్రాగా పట్టుకొచ్చినా ..అంతే సంగతులు. కిందటి వారం ఆవిడ లిస్ట్ లో "దొండ కాయలు– 23, "ఉత్తి వంకాయలు–6", మాత్రమే" అని రాసిందే అనుకోండి... నేను దొండకాయలు నాకు అంత 'ఇసటం' లేదు కదా అని 23 బదులు 21 తీసుకొస్తే .."వెధవ 21 ఈ బుల్లి వి ఏం చేసుకోనూ, ఒక పూటకి కూడా సరిపోవు" అనీ, ఆవిడ పొరపాటున రాసినది ఉత్తి కానీ అది గుత్తి కదా అనుకుని ఎందుకైనా మంచిది అని పెద్ద వంకాయలు ఏడు తెస్తే, "ఏకంగా ఇంత పెద్దవి తెస్తే నీ బాబు వండుతాడా? అనీ మా తండ్రిగారిని గుర్తు చేసుకుని మా క్వీన్ విక్టోరియా విసిరి కొట్టును. నేను మళ్ళీ వాల్ మార్ట్ కి వెళ్ళి, ఒక పెద్ద వంకాయ రిటర్న్ చేసినప్పుడు, రెండే రెండు దొండ కాయలు కొంటున్నప్పుడు, అక్కడి సేల్స్ అమ్మాయిలు నా వేపు చూసిన చూపులు ఈ అమెరికా జన్మలో మర్చిపోలేను. ఈ కేటగిరీలు అన్నీ కలిపి "అమెరికొంప కెలికింగ్" అంటారు.

ఇక అమెరికాలో మన తెలుగు సంఘాల మాట కొస్తే.. ఏ ఊళ్ళో అయినా సరే, వాటిలో సామూహికంగా, విషయం ఏదైనా సరే తప్పని సరిగా జరిగేది మరొక రకం కెలికింగ్. ఉదాహరణకి మొన్నీ మధ్య మా ఊళ్ళో ఒకాయనకి అమెరికొత్తాలోచన వచ్చింది. "ఇప్పటి దాకా మన తెలుగు సంఘానికి సేవ చెయ్యడానికి ఏడుగురు మాత్రమే కమిటీలో ఉంటే చాలు అని ఎప్పుడో యాభై ఏళ్ళ క్రితం అనుకున్నారు. అప్పుడు అలా అనుకున్న వారిలో వంగూరి గాడు ఒక్కడే బతికున్నాడు. ఆ రోజుల్లో ఇమైలూ లేదు, ఫేస్ బుక్కూ లేదు, వాట్సాపూ లేదు. పాపం ఊళ్ళోనే ఉండి ఒకళ్ళకి ఒకరు పోస్ట్ కార్డు లో ఉత్తరాలు రాసుకుని, ఉగాది, సంక్రాంతి ప్రోగ్రాములు పెట్టుకునే వారుట. మరి ఇప్పుడు మన ఎడ్వాన్డ్ సమాజం లో పేటకి పది చొప్పున వాట్సాప్ గ్రూపులే వంద పైగా ఉన్నాయి కాబట్టి మన నిర్వాహక కమిటీలో తొమ్మిది మంది, ట్రస్టీలుగా ఐదుగురు ఉండేలా మన రాజ్యాంగం మార్చాలి". ఇదీ ఆయన అమెరికొత్తాలోచన. ఇహ చూసుకోండి..కెలుకుడే కెలుకుడు.

"మార్చవచ్చును కానీ దానికి ముందు మన రాజ్యాంగం, అనగా by-laws సవరించాలి కదా" అని ఒక అమాయకెలికింగ్ తో ఈ వాట్సాప్ వేడి మొదలయింది. "బై లాస్ సవరించవచ్చు కానీ దానికి జనరల్ బాడీ మీటింగ్ పెట్టి, అందులో మూడో వంతు శాతం ఒప్పుకోవాలి కదా" అని కొంచెం అమెరికోపం కెలికింగ్, ఆ తర్వాత ఇక ఒకరి తర్వాత ఒకరు విజృంభించి అమెరికోడికెలికింగ్, కొక్కొరొకో కెలికింగ్, పది మంది నుంచి పాతిక పైగా స్పెషల్. డీలక్స్, అర్ధరాత్రి, అపరాత్రి, పట్టపగలు మొదలైన ప్రక్రియలతో "అసలు నువ్వెవడివిరా, బచ్చా" 'నీ జాతకం నాకు తెలుసు" లాంటి ప్రగాఢమైన ప్రవచనాలతో ఈ కెలికింగ్ పరంపర మాకు చాలా వినోదం పంచిపెట్టి కళ్ళమ్మట నీళ్ళు తెప్పించింది. అమెరికా తెలుగు సంఘాలలో ఇలాంటి వాటిని 'అమెరికులకెలికింగ్" అంటారు. అంటే ఆవు వ్యాసం లాగా అసలు

విషయం ఏదైనా సరే....ఆఖరికి అందరూ కులకెలికింగ్ లో భాగస్వాములే. ఉదాహరణకి ఏదో పెద్ద పెద్ద మనిషిలాగా నేను "అసలు మొట్టమొదట ఆ బై లాస్ నేను తెలుగు లో రాశాను...కేవలం 10 వాక్యాలు. అవి ఎవరైనా చదివారా" అని ఈ కెలికింగ్ పరంపరలో పొరపాటున తల దూర్చానే అనుకోండి. అప్పుడు అది 'అమెరికరణం కెలికింగ్" అవుతుంది అనమాట. అలాగే మిగతావి ఆయా కులాల వారీగా "అమెరికమ్మ కెలికింగ్", అమెరెడ్డి కెలికింగ్', "అమెరికోమటి కెలికింగ్"...ఇలా ఎవరి పరిధుల్లో వారు విహరిస్తూ ఉంటారు. అలా అని ఎప్పుడైనా వాట్సాప్ లో కాకుండా ఏదైనా ఉగాది కార్యక్రమం లోనో కలుసుకున్నప్పుడు అమెరికావలించుకుని అన్నీ మర్చిపోతాం. పేకాట పేకాటే..బామ్మరిది బామ్మరిదే! ముందే చెప్పానుగా...తెలుగు జాతి లక్షణం...అమెరికాలో "అమెరికుల కెలికింగ్". యునైటెడ్ కింగ్ డమ్ లో "బ్రిటన్ కెలికింగ్" ఇలా...ఆయా దేశాలలో ఆయా కెలికింగ్ ప్రక్రియలు నిరాఘాటంగా కొనసాగుతూ ఉంటాయి. అన్నింటికీ మూలం..'తెకోరాకకెలికింగ్'...అనగా..తెలంగాణా, కోస్తా, రాయల సీమ, కళింగ కెలికింగ్..లు అనమాట. ఖండ ఖండాలలో మన సంస్కృతిని పాటించడం అనమాట.

చివరిగా....మా ప్రపంచవ్యాప్తంగా కెలికింగ్ కింగ్ గా నొబెల్ బహుమతి అందుకునే అర్హత ఉన్న ఏకైక వ్యక్తి మా డానల్డ్ ట్రంప్ గారే...ఆ అమెరికోతి గారి కొబ్బరి చిప్ప పేరు 'టారిఫ్".. ప్రపంచంలో ప్రతీ దేశాన్నీ అమెరికెలికింగ్ చేసి పారేస్తున్న ఈ టారిఫ్ అనే అమెరికొబ్బరి కెలికింగ్ కి మొన్నీ మధ్య మా అమెరికా సుప్రీంకోర్ట్ వారు తోలు వలిచి ఆ ఆటకి అడ్డుకట్ట వేశారు...వేశాం అనుకున్నారు..కానీ ఇప్పుడు ట్రంప్ గారు అదే టారిఫ్ విషయాలలో అమెరికాంగ్రెస్ తో ఇంకెవరూ కెలక్కుండా కొత్త పద్ధతులలో ఇంకాస్త ఎక్కువగా విజృంభిస్తారు అనడంలో ఏ మాత్రం సందేహం లేదు. పులి రక్తం మరిగింది కదా. మిగతా వన్నీ ఎలా ఉన్నా..."రష్యా-యుక్రెయిన్ యుద్ధం మొదటి రోజునే ఆపేస్తాను" అని ప్రగల్భాలు పలికిన ట్రంప్ గారి కెలుకుడు ఇంకా ఎక్కడ వేసిన గొంగళీ గానే ఉంది. పుటిన్ గారు యుక్రెయిన్ ని కెలకడం ఆపనే లేదు.

అనవసరంగా కెలకడం మానవ జాతికి మాత్రమే ఉన్న లక్షణం...అవునంటారా? కాదంటారా?

**COMMENTS**